కోనరావుపేట : నిమ్మపల్లి మూలవాగు ప్రాజెక్టు వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

ముస్తాబాద్ : రామలక్ష్మణులపల్లె వద్ద మానేర్ వాగులో నీట మునిగిన శ్రీసీతారామలక్ష్మణుల ఆలయం

సిరిసిల్ల రూరల్ : చిన్నలింగాపూర్-రాంచంద్రపూర్ కల్వర్టును పరిశీలిస్తున్న డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఐ సుధాకర్

వేములవాడ : పునరావాస కేంద్రంలో బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, కౌన్సిలర్లు

బోయినపల్లి : స్తంభంపల్లిలో గంజివాగు వద్ద తెగిన రహదారిని పరిశీలిస్తున్న ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి

సిరిసిల్ల పట్టణంలో రోడ్లపైకి చేరిన వరద నీరు

వాన..వరద

- జిల్లాలో భారీ వర్షం
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- ఎగువ, మధ్యమానేరులోకి చేరుతున్న వరద నీరు
- లోతట్టు ప్రాంతాలు జలమయం

కోనరావుపేట : వెంకట్రావుపేట, బావుసాయిపేట గ్రామాల మధ్యలో ఉధృతంగా ప్రవహిస్తున్న మూలవాగు

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ) : వాన వరదైంది. ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి జిల్లా జలమయమైంది. జనజీవనం స్తంభించింది. చెరువుల్లోకి నీరు చేరి అలుగులు దుంకుతున్నాయి. వరదలతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా శనివారం సాయంత్రం నుంచి మొదలైన వర్షం, ఆదివారం సాయంత్రం వరకు ఏకధాటిగా దంచికొట్టింది. భారీ వర్షానికి వార్డులు జలమయం అయ్యాయి. ప్రజలు ఇండ్ల నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వేములవాడ, కోరుట్ల, వేములవాడ నుంచి మరిమడ్ల, సిరిసిల్ల నుంచి మరిమడ్లకు వెళ్లే రూట్లలో వాగులు పొంగిపొర్లడంతో ఆర్టీసీ బస్సులను నిలిపి వేసింది. సిరిసిల్ల మానేరు, వేములవాడ మూలవాగులకు వరద పోటెత్తింది. కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి చెరువు మత్తడి దూకింది. తంగళ్లపల్లి మండలం మండెపల్లి, వేములవాడ మండలంలోని పలు గ్రామాల్లోని పురాతన ఇండ్లు వర్షానికి కూలిపోయాయి.

రోడ్లపైకి వరద నీరు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 1: సిరిసిల్ల పట్టణం లో భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అనంతనగర్, అశోక్ నగ ర్, వెంకంపేట, సంజీవయ్యనగర్, పాత బస్టాండ్, శ్రీనగర్, శాంతినగర్ కాలనీలలో వర్షం నీరు రోడ్లపైకి చేరింది. సిరిసిల్ల-కరీంనగర్ ప్రధాన రహదారిలో పాతబస్టాండ్ నుంచి కొత్త చెరువు వరకు రోడ్లపై నీటి ప్రవాహంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పలేదు. సిరిసిల్ల మానేరు వాగు నిండుకుండను తలపిస్తున్నది. భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ పట్టణంలోని పలు ప్రాంతాలలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ శనివారం ఒక ప్రకటన ద్వారా పేర్కొన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో ఎవరూ ఉండవద్దని సూచించారు. శాంతినగర్, శ్రీనగర్ కాలనీ, రాజీవ్‌నగర్, పద్మనగర్, వెంకంపేట, సంజీవయ్యనగర్, తదితర లోతట్టు ప్రాంతాలలో నివాసం ఉంటున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వరద ప్రభావానికి గురైన వారికి స్థానిక కమ్యూనిటీ భవనాలలో ఆశ్రయం ఏర్పాటు చేస్తామన్నారు. స్థానిక పరిస్థితులను ఎమ్మెల్యే కేటీఆర్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

సిరిసిల్ల రూరల్, సెప్టెంబర్ 1: వర్షంతో తంగళ్లపల్లి మండలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరడంతో ఇబ్బందులు పడ్డారు. మండెపల్లిలో చెక్కపల్లి చంద్రయ్య, చెక్కపల్లి అజయ్ పెంకుటిల్లు కూలింది. రామచంద్రంపూర్-చిన్నలింగాపూర్ మధ్య కల్వర్టు పొంగడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్, ఎస్ఐ సుధాకర్ వరద ప్రభావిత ప్రాంతాలను పర్యవేక్షించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చిన్నబోనాల పెద్ద చెరువులో భారీగా వర్షంనీరు చేరింది. భూపతి నగర్‌లోని భవాని కుంట, చంద్రంపేటలోని ఈదుల చెరువుకు భారీగా వర్షపు నీరు చేరింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చెరువు సమీపంలో రాజీవ్‌నగర్‌లోని ఇళ్లలోకి వర్షంపు నీరు చేరింది. ఈదుల చెరువు సమీపంలో చంద్రంపేట లో రోడ్లపైకి వర్షంపు నీరు చేరడంతో కౌన్సిలర్ రాజిరెడ్డి ఎక్స్‌కవేటర్‌తో నీటిని మళ్లించారు.

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 1: వర్షంతో మండల కేంద్రంలోని గిద్ద చెరువు సైతం నిండింది. దుమాలలోని పెద్ద చెరువు నిండి మత్తడి దుంకుతున్నది. పదిర-రామలక్ష్మణులపల్లి కాజ్వే నుంచి పెద్దవాగు ఉప్పొంగి ప్రవహిస్తుండగా పోలీసులు రాకపోకలను నిలిపివేశారు. పదిర-హరిదాస్‌నగర్ రోడ్డు తెగిపోవడం, చిట్టి వాగు పొంగిపొర్లుతుండటంతో ఆవునూరు-హరిదాస్‌నగర్ రాకపోకలు నిలిచిపోయాయి.

ముస్తాబాద్, సెప్టెంబర్ 1: ఆవునూర్ గ్రామం వద్ద మానేరు వాగులో నిర్మించిన చెక్ డ్యాం పొంగి పొర్లుతోంది. రామలక్ష్మణులపల్లె వద్ద మానేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామంలోని శ్రీసీతారామస్వామి ఆలయం నీట మునుగడంతో రాకపోకలు నిలిచి నిత్య పూజలు నిలిచాయి. తెర్లుమద్ది, గన్నెవానిపల్లె, పోతుగల్ శివారులో నక్క వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. ఎగువ మానేర్‌లోకి పాల్వంచ, కూడవెల్లి వాగుల ద్వారా భారీగా వరద నీరు వస్తున్నది. భారీ వర్షాల వల్ల జరిగే విద్యుత్ ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముస్తాబాద్ సెస్ డైరెక్టర్ సంధుపట్ల అంజిరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సెస్ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో విద్యుత్ ప్రమాదాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

ఇల్లంతకుంట, సెప్టెంబర్ 1 : మండల కేంద్రంలోని దుకాణాల్లోకి వరద నీరు వచ్చి చేరింది. కందికట్కూర్‌లోని పలు కాలనీల్లో వరద నీరు ఇండ్లలోకి చేరగా ఆర్డీవో రమేశ్, తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీవో శశికళ పర్యటించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వల్లంపట్ల శివారులోని ఒర్రె, నర్సక్కపేట శివారులోని ఒర్రె ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిపోయాయి. తిప్పాపూర్‌లోని చిన్న వాగు, నర్సక్కపేట, గాలిపెల్లి మధ్య బిక్కవాగు ఉధృతంగా ప్రవహించడంతో ఎస్ఐ శ్రీకాంత్ రోడ్డుకు అడ్డంగా ట్రాక్టర్‌ను పెట్టించి రాకపోకలను నిలిపివేశారు. నర్సక్కపేట, జవారుపేట గ్రామాల మధ్య బిక్కవాగులో రోడ్డుకు ఎడ్ల బండ్లను, ముళ్లకంప పెట్టి రాకపోకలను నిలిపివేశారు. కార్యక్రమంలో ఆర్ఐ షఫీ, ఎంపీవో వాజిద్, కార్యదర్శులున్నారు.

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, సెప్టెంబర్ 1: భారీ వర్షాలతో వేములవాడ పురపాలక సంఘం పరిధిలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలను ఆదివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 13వ వార్డులోని బుడుగ జంగాల కాలనీలో 18 నివాసాల్లోకి నీరు చేరగా బాధిత కుటుంబాలను హరిమల గార్డెన్‌లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి తరలించారు. మరోవైపు 11వ వార్డు విద్యానగర్‌లోని పలు నివాసాల్లోకి వరద నీరు చేరింది. కమిషనర్ సంపత్‌రెడ్డి ఎక్స్‌కవేటర్ సహాయంతో వరద నీటిని మళ్లించారు. తిప్పాపూర్‌లో గసికంటి ఎల్లవ్వ ఇల్లు కూలింది. గుడి చెరువులోకి భారీగా వరద నీరు చేయడంతో భగవంత రావు నగర్ నుంచి కుడి చెరువులోకి వెళ్లే మురుగు కాలువలు మూసుకుపోవడంతో జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, భగవంత రావు నగర్ ప్రధాన రహదారి జలమయమైంది. పట్టణంలోని మూలవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వేములవాడ పట్టణంలో 8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దని ప్రభుత్వ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వీరి వెంట ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, తహసీల్దార్ మహేశ్ కుమార్, కమిషనర్ సంపత్ రెడ్డి, వైస్ చైర్మన్ బింగి మహేశ్, కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, జోగిని శంకర్, సిరిగిరి రామచందర్, గోలి మహేశ్, ఇప్పపూల అజయ్, పట్టణ సీఐ వీర ప్రసాద్ తదితరులున్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న మూలవాగు

కోనరావుపేట, సెప్టెంబర్ 1: భారీ వర్షానికి చెరువులు, కుంటలు పొంగిపొర్లడంతో మూలవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. వరి, పత్తి పంట చేలలో నీరు నిల్వడంతోపాటు పలు ప్రాంతాల్లో పంటలు పూర్తిగా నీటమునిగాయి. నిమ్మపల్లి మూలవాగు ప్రాజెక్టుకు భారీగా వరద నీరు చేరుకుంది. ఎగువ ప్రాంతాలైన చీమన్‌పల్లి, గర్జనపల్లి, తాటిపల్లి, అడవిపదిర గ్రామాల్లో చెరువులు, కుంటలు నిండాయి. అక్కడి నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించి ప్రాజెక్టులోకి చేరింది. మూలవాగు ప్రాజెక్టు సామర్థ్యం 19అడుగులు కాగా పూర్తిగా నిండిపోయి, అలుగు దుంకింది. వరదనీరు భారీ రావడంతో నిమ్మపల్లిలోని ప్రధాన రోడ్డులో ఉన్న హైలెవల్ బ్రిడ్జి కోతకు గురైంది. మూలవాగు పొంగిపొర్లడంతో పట్టిమల్ల నుంచి నిమ్మపల్లి, వెంకట్రావుపేట నుంచి బావుసాయిపేట, మామిడిపల్లి నుంచి నిజామాబాద్ గ్రామాల మధ్యలో ఉన్న లోలెవల్ బ్రిడ్జిలు ధ్వంసమయ్యాయి. దీంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయా యి. మరిమడ్ల గ్రామ పరిధిలో ఉన్న హమ్మదూషన్‌పల్లెలో శనిగారపు లచ్చవ్వ పెంకుటిల్లు కూలిపోయింది. ఆమెను ప్రభుత్వం ఆదుకోవాలని కుమ్మరి దిలీప్, పుల్కం మల్లేశం తదితరులు కోరారు.

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకుంటాం : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు పొంగిపొర్లుతున్న చెరువులు, వాగులను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పరిశీలించారు. మండలంలోని నిమ్మపల్లి మూలవాగు ప్రాజెక్టు వరదనీటిని, కోతకు గురైన నిమ్మపల్లి హైలెవల్ వంతెనను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట వేములవాడ ఏఎస్పీ శేష్రాదినిరెడ్డి, చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ విజయప్రకాశ్‌రావు, ఎస్ఐ శేఖర్‌రెడ్డి, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు పాషా, జిల్లా ఉపాధ్యక్షుడు చేపూరి గంగాధర్, తదితరులున్నారు.

రుద్రంగి, సెప్టెంబర్ 1: నందివాగు, గండి వేంకటేశ్వర స్వామి ఒర్రె, మత్తడి దుంకిన గోలపుల్దొడ్డి చెరువు, కొచ్చగుట్టతండాకు వెళ్లే కాలువ, మాటు కాలువ ఉధృతంగా ప్రవహించడంతో పోలీస్ సిబ్బంది వాహనాలను నిలిపివేసి, ఉధృతి తగ్గిన తరువాత అనుమతించారు. మండల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆదివారం అశోక్ సూచించారు. మానాలలో తాతమ్మ చెరువు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో బారికేడ్లు ఏర్పాటు చేసి గ్రామాలకు రాకపోకలను నిలిపివేశారు. బడితండాలో వరద ఉధృతికి చుట్టపక్కల గ్రామాల నుంచి రాకపోకలను నిలిపివేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏరియాలోని ఇండ్లలో శనివారం రాత్రి భారీ కొండచిలువ ప్రత్యక్షం కావడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. తమకు హానికలిగిస్తుందని స్థానికులు కర్రలు, బండలతో కొండచిలువను కొట్టి చంపారు.

గ్రామాలకు నిలిచిన రాకపోకలు

వేములవాడ రూరల్, సెప్టెంబర్ 1: భారీ వర్షానికి చెరువులు మత్తడి దుంకడంతో మూలవాగు, నక్కవాగు ప్రవాహం ఊపందుకున్నాయి. మల్లారంతోపాటు హన్మాజీపేటకు వెళ్లే దారిలో ఒర్రెలు ఉధృతంగా ప్రవహించాయి. మారుపాకలో చెరువు మత్తడి దుంకడంతో వెళ్లకుండా ట్రాక్టర్లను అడ్డుపెట్టారు. బోయినపల్లి వెళ్లే రహదారిలో కల్వర్టు వద్ద వరదనీరు ఉధృతంగా ప్రవహించింది. వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మారుతి వాగులు, వంకల వద్ద పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

బోయినపల్లిలో స్తంభించిన రవాణా

బోయినపల్లి, సెప్టెంబర్ 1: బోయినపల్లి నుంచి వేములవాడ వెళ్లే రహదారిలో బోయినపల్లి వద్ద వంతెనపై నుంచి భారీగా వరద నీరు వెళ్లగా, రాకపోకలను నిలిపివేశారు. స్తంభంపల్లి గంజివాగురె వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, బోయినపల్లి ఎస్ఐ పృథ్వీధర్ పరిశీలించి, రాకపోకలను మూసివేశారు. బురుగుపల్లి వంతెన వద్ద రహదారిపై చెట్టు విరిగి పడగా, కొన్ని గంటలు ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. బోయినపల్లి, కొదురుపాక రహదారిలో వంతెన పైనుంచి వరద నీరు వెళ్లగా, మధ్యాహ్నం వరకు రాకపోకలను మూసివేశారు. విలాసాగర్ చెరువు, బోయినపల్లి వంతెనను ఎంపీడీవో జయశీల పరిశీలించారు. గ్రామాలను తహసీల్దార్ పుష్పలత సందర్శించారు. కోరెం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో వర్షం కారణంగా విద్యుత్ సరాఫరలో అంతరాయం ఏర్పడింది.

ఎస్సారార్‌కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బోయినపల్లి, సెప్టెంబర్ 1: బోయినపల్లి మండలం మాన్వాడ ఎస్సారార్ జలాశయానికి ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయిత్రీ పంప్‌హౌస్ వరద కాలువ ద్వారా 4,105 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వచ్చినట్లు జలశాయం ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. అదేవిధంగా దిగువ ఉన్న జలశాయంకు 9550 క్యూసెక్కుల నీరు ఆవుట్‌ఫ్లో ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు జలాశయం సామర్థ్యం 27.54 టీఎంసీలు కాగా, 15.83 టీఎంసీల నీటి నిలువ ఉన్నట్లు జలశాయం అధికారులు తెలిపారు.

బోయినపల్లి కోరెం కిష్టమ్మ చెరు వు, బండ్లకుంట చెరువు మత్తడి దుంకాయి. విలాసాగర్, బోయినపల్లి, బూరుగుపల్లి గ్రా మాల్లో చెరువులు జలకళ సంతరించుకున్నాయి.

మత్తడి దూకుతున్న చెరువులు

వీర్నపల్లి, సెప్టెంబర్ 1: అడవి పదిర ధర్మారం చెరువు, మద్దిమల్ల రాయిని చెరువు, వీర్నపల్లి వెంకట్రాయిని చెరువులు జలకళను సంతరించుకున్నాయి. పూర్తిస్థాయిలో నిండి మత్తడి దుంకుతున్నాయి. శాంతినగర్, గర్జనపల్లి వద్ద మూలవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. కాశీతండాలో వాగు ఉధృతికి రాకపోకలు నిలిచిపోయాయి. తండావాసులు తాడు సాయంతో వాగును దాటారు. గర్జనపల్లిలో మల్యాల పూజిత ఇల్లు కూలిపోగా, తక్షణ సాయం కింద ఇన్‌చార్జి తహసీల్దార్ మారుతి రెడ్డి రూ.3200 అందించారు.

చందుర్తి , సెప్టెంబర్ 1: మూడపెల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు కల్వర్టు పైనుంచి నీరు ప్రవహించడంతో రాకపోకలకు జనం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మల్యాల గ్రామంలోని వెంగళచెరువు మత్తడి దుంకడంతో కోరుట్ల వేములవాడ ప్రధాన రహదారిలో గల కల్వర్టు పైనుంచి నీరు ప్రవహించి, వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రామన్నపేట శివారులోని లౌడి చెరువు మత్తడి దుంకడంతో చందుర్తి నుంచి రామన్నపేట తిమ్మాపూర్ ఆశిరెడ్డిపల్లి గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. కట్ట లింగంపేట గ్రామంలో మిరుపాల ఎల్లవ్వ ఇంటిపై చెట్టు విరిగిపడింది. జోగాపూర్ శివారులోని ఎల్లమ్మ ఆలయ సమీపంలో గల కల్వర్టు పైనుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో మర్రిగడ్డ నుంచి జోగాపూర్ కిష్టంపేట రామారావుపల్లి సనుగుల దేవుని తండాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

నిండుకున్న నర్మాల ఎగువ మానేరు

గంభీరావుపేట, సెప్టెంబర్ 1: మండలంలోని నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు నిండుకుండలా నిండుకుని దిగువకు మత్తడి దూకుతున్నది. ప్రాజెక్టు సామర్థ్యం 31 అడుగులకు ఆదివారం రాత్రి వరకు పూర్తిస్థాయిలో నిండుకున్నది. భారీ వర్షాలతో కామారెడ్డి జిల్లా పాల్వంచ, సిద్దిపేట జిల్లా కూడవెల్లి వాగుల ద్వార మానేరుకు భారీగా వరద నీరు చేరింది. దీంతో రెండు టీఎమ్‌సీ సామర్థ్యం గల ఎగువ మానేరు ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండుకుని దిగువకు మత్తడి దుంకడంతో ఆయకట్టు అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గంభీరావుపేట, సెప్టెంబర్ 1: లింగన్నపేట వాగు హైలెవల్ వంతెన నిర్మాణంలో భాగంగా పక్కన వేసిన తాత్కాలిక రోడ్డు కొట్టుకపోయి లింగన్నపేట-గంభీరావుపేట గ్రామాల మధ్య రవాణా నిలిచిపోయింది. ఎగువ మానేరు ప్రాజెక్టు వద్ద పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి రోడ్డును బ్లాక్ చేశారు. గోరంటాల వాగు ఉధృతంగా ప్రవహించడంతో సింగసముద్రం చెరువుకు భారీగా వరద నీరు చేరుతున్నది. మండల కేంద్రంలోని పెద్ద కాలువకు గండి పడడంతో పంట పొలాలు నీట మునిగాయి.

నేడు విద్యాసంస్థలు బంద్

తెలంగాణ చౌక్, సెప్టెంబర్ 1: జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నేడు(సోమవారం) విద్యాసంస్థలకు సెలువు ప్రకటిస్తున్నట్లు డీఈవో రమేశ్‌కుమార్ ఆదివారం ప్రకటన ద్వారా వెల్లడించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల యజమానులు నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- హెల్ప్ లైన్ నంబర్ 9398684240

కలెక్టరేట్, సెప్టెంబర్ 1 : భారత వాతావరణ శాఖ నివేదిక నేపథ్యంలో జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కంట్రోల్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీటి పారుదల శాఖ, రోడ్లు, భవనాలు శాఖ, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ శాఖ, మున్సిపల్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు స్థానికంగా అందుబాటులో ఉండాలని, కల్వర్టులు, రోడ్ల పరిస్థితిని కనిపెట్టుకుంటూ ఉండాలని పేర్కొన్నారు. మానేరు నది పరీవాహక ప్రాంతం, చెరువులు, జలాశయాల నీటి మట్టాలను పర్యవేక్షిస్తూ ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అధికారులు అందుబాటులో ఉంది సహాయక చర్యల్లో పాల్గొనాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. ప్రజలు బయటికి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటూ జిల్లా యంత్రాంగానికి సహకరించాలని సూచించారు. జి ల్లా వ్యాప్తంగా అధికారులు శిథిలమైన ఇండ్లు, లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు.

మండలాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ)/కలెక్టరేట్: భారీవర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు. ఆయా మండలాల్లోని గ్రామాల ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో కంట్రోల్ రూమ్ నెంబర్లను సంప్రదించాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సిరిసిల్ల 9908116490, వేములవాడ 8723238767, వేములవాడ రూరల్ 8179987985, తంగళ్లపల్లి 9963453922, వీర్నపల్లి 9014054047, రుద్రంగి 8309472948, ఎల్లారెడ్డిపేట 8121233676, 9948372219, 8107420281, ముస్తాబాద్ 9505174172, కోనరావుపేట 9490542412, 9652117683, గంభీరావుపేట 9703332192, ఇల్లంతకుంట 9985437929, చందుర్తి 9866920083, బోయినపల్లి 9701338055 ఆయా మండలాల ప్రజలకు అధికారులు అందుబాటులో ఉంటారని వెల్లడించారు.

నేటి ప్రజావాణి రద్దు

కలెక్టరేట్, సెప్టెంబర్ 1 : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సోమవారం ప్రజావాణి రద్దు చేసినట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదివారం ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు గమనించాలని కోరారు. భారీ వర్షాలు కురుస్తున్నాయని జాలర్లు చేపల వేటకు వెళ్లవద్దని, నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న రోడ్లు, వంతెనలపై నుంచి వాహనదారులు వెళ్లకూడదని సూచించారు. అధికారులందరూ స్థానికంగా అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

వేములవాడ : పట్టణంలో వరద నీటి ప్రవాహంతో ప్రవహిస్తున్న మూలవాగు

కోనరావుపేట : మామిడిపల్లి గ్రామంలో పత్తి పంటలో నిలిచిన వరదనీరు

బోయినపల్లి వంతెనపై నుంచి వెళ్తున్న వరదనీరు

అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

వేములవాడ రూరల్ : హన్మాజీపేట నక్కవాగును పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్

కోనరావుపేట, సెప్టెంబర్ 1: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి, నిజామాబాద్, వెంకట్రావుపేట, బావుసాయిపేట గ్రామాల మధ్యలో ఉధృతంగా ప్రవహిస్తున్న మూలవాగును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇక్కడ అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్ విజయ్‌ప్రకాశ్‌రావు, చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శేఖర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ఎల్సాని ప్రవీణ్ తదితరులున్నారు.

చందుర్తి, సెప్టెంబర్ 1: వరద నీరు ప్రవహిస్తున్న కల్వర్టులపై, రోడ్లపై ప్రయాణికులు రాకపోకలు సాగించవద్దని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. చందుర్తి మండలం మూడపల్లి, మల్యాల గ్రామాల్లో రహదారుల మీద ప్రవహిస్తున్న వాగులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్యానాయక్ ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వాగులు ప్రవహిస్తున్న రహదారిపై ప్రయాణికులు రాకపోకలు సాగించకుండా చూడాలన్నారు. ఇక్కడ వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, అధికారులున్నారు.

వేములవాడ రూరల్,సెప్టెంబర్ 1: నక్కవాగును కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరం అయితేనే బయటకు రావాలన్నారు.

విపత్కర సమయంలో డయల్ 100కు ఫోన్ చేయండి : ఎస్పీ

తెలంగాణ చౌక్, సెప్టెంబర్ 1: జిల్లా వ్యాప్తంగా భారీగా వర్షాలు పడుతున్న నేపథ్యంలో విపత్కర సమయంలో డయల్ 100కి కాల్ చేసి సహాయం పొందాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. జిల్లాలోని పోలీస్ అధికారులను అప్రమత్తం చేసి డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌ను 24/7 అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న వాగులు, చెరువుల వద్దకు ప్రత్యక్షంగా వెళ్లి నీటి ప్రవాహాన్ని పర్యవేక్షించి తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

PLOT FOR SALE

★కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌